### జిల్లా ప్రజలకు కలెక్టర్ దసరా శుభాకాంక్షలు

కామారెడ్డి, అక్టోబర్ 22 : చెడుపై సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని, దసరా పండుగను జిల్లా ప్రజలు కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి పనిలో విజయాలు చేకూరాలని ఆకాంక్షిస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఓటరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

### విద్యుత్ షాక్‌తో గేదె మృతి

తాడ్వాయి, అక్టోబర్ 22: మండలంలోని సంతాయిపేట గ్రామానికి చెందిన మద్దికుంట సిద్ధరాములు గేదె ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. సిద్ధరాములు ఇంటి ముందర ఉన్న పాకలో గేదెను మేకుకు తాడుతో కట్టేశాడు. ఇంట్లో నుంచి కరెంట్‌ను ఇంటి ముందర ఉన్న పాకకు సరఫరా చేసి బల్బు ఏర్పాటు చేశాడు. శనివారం రాత్రి వైరు తెగి గేదె మీద పడడంతో షాక్ తగిలి చనిపోయిందని గ్రామస్తులు తెలిపారు. గేదె విలువ రూ.45 వేల వరకు ఉంటుందని అన్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### అభివృద్ధిపై ప్రజలకు అవగాహన



ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అభివృద్ధిని వివరిస్తున్న నాయకులు

డోంగ్లీ, అక్టోబర్ 22: జుక్కల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తరఫున ప్రచారాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నారు. డోంగ్లీలోని మార్కెట్ ప్రాంతంలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ఆదివారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎం బాల్‌రాజ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు దీన్‌దయాళ్ పాటిల్, యువకుడు హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

### 'సురేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం..'

సదాశివనగర్, అక్టోబర్ 22: ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, కుర్మ సంఘం ఉపాధ్యక్షుడు మర్కంటి బుచ్చన్న అన్నారు. రేకులకుంట ఎల్లమ్మను ఆదివారం దర్శించుకున్న ఆయన.. సురేందర్‌ను గెలిపించాలని కోరుతూ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. సురేందర్ తరఫున గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామని, ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని ఆయన ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. కార్యక్రమంలో బోరింగ్ రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

### విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు



ఎల్లారెడ్డి పట్టణంలో స్తంభాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 22: ఎల్లారెడ్డి పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాలకు మున్సిపల్ సిబ్బంది ఆదివారం మరమ్మతులు చేపట్టారు. పట్టణంలోని పెద్దచెరువు కట్ట నుంచి అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్, గాంధీచౌక్, శివాజీచౌక్, రామాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్‌లో వెలగని విద్యుత్ దీపాలను తొలగించికొత్త వాటిని అమర్చారు. దసరా పండుగ సందర్భంగా కొత్త విద్యుత్ దీపాలను అమర్చడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రావణ దహనానికి ముమ్మర ఏర్పాట్లు



బాన్సువాడలో రావణ దహనానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



సదాశివనగర్‌లో ఏర్పాటు చేసిన స్టేజీ

బాన్సువాడ/ సదాశివనగర్, అక్టోబర్ 22 : బాన్సువాడ పట్టణంలో దసరా పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో రావణుడి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు చేస్తున్న ఏర్పాట్లను డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఆదివారం పరిశీలించారు. ముఖ్య అతిథిగా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి హాజరవుతారని వారు వెల్లడించారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, కమిషనర్ రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, బాబా, నార్ల ఉదయ్ తదితరులు ఉన్నారు.

*సదాశివనగర్‌లో..*

సదాశివనగర్‌లో సోమవారం నిర్వహించే దసరా ఉత్సవాల కోసం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం దసరా సందర్భంగా కళాకారులతో ఆటపాటలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకోసం ఆదివారం స్టేజిని ఏర్పాటుచేశారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం రావణ దహనం ఉంటుందని తెలిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

### దుర్గామాత పూజలో పాల్గొన్న ఎంపీ పాటిల్

మద్నూర్, అక్టోబర్ 22: మద్నూర్‌లోని ఇందిరానగర్ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాత పూజలో ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండాలని వేడుకున్నారు. దుర్గామాత కమిటీ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ రాంపటేల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బన్సీపటేల్, సర్పంచులు దరాస్ సురేశ్, గఫార్, మధుకర్ పటేల్, ఎంకే పటేల్, ఎంపీటీసీ దీన్‌దయాళ్, ఉపసర్పంచ్ విఠల్, యువ నాయకుడు అక్షయ్‌పటేల్, సొసైటీ మాజీ చైర్మన్లు పాకల విజయ్‌కుమార్, పండిత్‌రావు పటేల్, నాయకులు ఉన్నారు. అంతకుముందు బిచ్కుందలోని రామాలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పాల్గొన్నారు.



బిచ్కుంద రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే దంపతులు, ఎంపీ బీబీ పాటిల్

# ఉపాధ్యాయ కుటుంబాలకు పీఆర్టీయూ అండ



పండరి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పీఆర్టీయూ బాధ్యులు

పిట్లం, అక్టోబర్ 22: ప్రభుత్వ ఉపాధ్యాయుల కుటుంబాలకు పీఆర్టీయూ ఎల్లవేళలా అండగా ఉంటుందని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుశాల్‌పటేల్ అన్నారు. మండలంలోని చిల్లర్గి గ్రామానికి చెందిన ఎస్జీటీ పండరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబానికి ఆదివారం పీఆర్టీయూ శాఖ తరఫున లక్ష రూపాయల నగదును అందజేశారు. పండరి పీఆర్టీయూలో క్రియాశీల సభ్యత్వం కలిగి ఉన్నాడని, దీంతో పీఆర్టీయూ పిట్లం శాఖ సభ్యులు రూ.86,500 నగదును బాధిత కుటుంబీలకు అందజేసినట్లు చెప్పారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నారాయణ, ఎంఈవో దేవీసింగ్, మండల ప్రధాన కార్యదర్శి బన్సీలాల్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు నార్యా, సీనియర్ సభ్యులు గణేశ్‌రావు, పరమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్ రావు, రాష్ట్ర కార్యదర్శి ప్రమోద్‌కుమార్, జిల్లా బాధ్యులు విఠల్ యాదవ్, సంతోష్ రెడ్డి, కేశ్యా, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దోమకొండ ఎస్సై మురళి

దోమకొండ, అక్టోబర్ 22: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచార హక్కు చట్టం కరపత్రాలను ఎస్సై మురళి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం మాట్లాడుతూ... స.హ. చట్టం వార్షిక వారోత్సవాల సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అల్లె రవి, షేక్ అలీముద్దీన్, షేక్ మదార్ పాషా, ముత్యంపేట శ్రీనివాస్, అన్వర్‌గోరీ తదితరులు పాల్గొన్నారు.

### చాముండేశ్వరిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



అదనపు కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ ఈవో ప్రభు

దోమకొండ, అక్టోబర్ 22: మండలకేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయాన్ని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకుడు శరత్‌చంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ దంపతులకు ఆలయకమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్, ఈవో ప్రభు అమ్మవారి చిత్రపటాన్ని అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పీర్యా కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబర్ 22: ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన అంగోత్ పీర్యా (45) కుటుంబానికి అండగా ఉంటామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. పీర్యా శనివారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మరణించాడు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఆదివారం కలిసి ధైర్యం చెప్పారు. మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వెంట నాగిరెడ్డిపేట్ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఆత్మాకూర్ సర్పంచ్ బాల్‌రెడ్డి, తండా పెద్దలు ఉన్నారు.